ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం గోల్కొండ, లంగర్‌హౌస్, టోలిచౌకీ డివిజన్‌ల నుంచి పలువురు వచ్చి ఆయనను కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఆయనకు వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కార్వాన్ నియోజకవర్గ ప్రజాప్రతినిధిగా ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలను స్వయంగా పరిశీలిస్తున్నానన్నారు. తాను క్రమం తప్పకుండా సమస్యల పరిష్కారానికి వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి తన దృష్టికి వచ్చిన సమస్యలను వారికి వివరిస్తున్నానని అన్నారు. వర్షాకాలంలో నానల్‌నగర్, గోల్కొండ, టోలిచౌకీ తదితర డివిజన్‌లో పలు బస్తీలు ముంపునకు గురయ్యేవని అయితే ఆయా ప్రాంతాల్లో వరద ముంపు నివారణకు చేపట్టిన పనుల వల్ల ఆయా బస్తీలకు వరద ముంపు ప్రమాదం తప్పిందని ఆయన అన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.


ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కౌసర్

చెక్కుచెదరని చారిత్రక మసీదులు


కుతుబ్‌షాహి రాజులు ప్రార్థనలు చేసిన కుతుబ్‌షిహి మసీదు

- ఇప్పటికీ ఆకట్టుకుంటున్న కుతుబ్‌షాహి కాలం నాటి మసీదులు
- ప్రత్యేక డిజైన్‌లతో నిర్మాణం

గోల్కొండ: చారిత్రక మసీదులకు గోల్కొండ, షేక్‌పేట్ ప్రాంతాలు ప్రసిద్ధి. గోల్కొండ కోట నిర్మాణ కాలంలోనే ఈ మసీదుల నిర్మాణానికి పునాదులు పడ్డాయి. ఈ ప్రాంతాలలో ఐదు వందల ఏళ్లక్రితం నిర్మించిన మసీదులు నేటికి చెక్కు చెదరకుండా ఉన్నాయి. కుతుబ్‌షాహి వంశపు రాజులు, కుటుంబ సభ్యుల కోసం గోల్కొండ కోట మెయిన్ గేటు ముందు ప్రత్యేకంగా జామా మసీదు నిర్మించబడింది. ప్రతినిత్యం గోల్కొండకోట రాజ్‌మహల్ నుంచి రాజు ఈ మసీదుకు వచ్చి ప్రార్థనలు చేసే వారు. అదేవిధంగా సేనాధిపతి, సైనికులు, రాజును కలవడానికి వివిధ ప్రదేశాల నుంచి వచ్చే వారికోసం ప్రత్యేకంగా మసీదును ఆకాలంలో నిర్మించబడ్డాయి.

సైనికుల కోసం ప్రత్యేకంగా..

గోల్కొండ కోటకు ఉన్న ప్రధాన దర్వాజాలైన మోతీదర్వాజా, ఫతేదర్వాజా, మక్కైదర్వాజాల వద్ద సైనికుల కోసం ప్రత్యేకంగా మసీదులు నిర్మించబడ్డాయి. అంతేకాకుండా గోల్కొండ ప్రహరీకి కాపాల కాసే సైనికులకు ప్రహరీని అనుకోని చిన్నచిన్న మసీదులు కూడా నిర్మించబడ్డాయి. అప్పటి ఇతర దేశాల నుంచి గోల్కొండ కోటలో రాజును కలవడానికి వచ్చే అతిథులు, రాయబారుల కోసం షేక్‌పేట్‌లో విడిది గృహంతో పాటు అతిథుల కోసం ప్రత్యేకంగా మసీదు నిర్మించారు. వీటిలో అబ్దుల్లా మసీదు ఒకటి మాత్రమే పూర్తిగా శిథిలావస్థలో ఉండగా ఇతర మసీదులు నేటికి దర్జాగా రాజ ఠీవీని వలకబోస్తున్నాయి.

పిడుగు పడినా చెక్కుచెదరకుండా..

గోల్కొండ కోట ముందు గల కుతుబ్‌షాహి జామా మసీదు, బడాబజార్‌లోని చీనీ మసీదు, లంగర్‌ఖానా మసీదులలో నేటికీ ముస్లిం సోదరులు నమాజ్ ఆచరిస్తున్నారు. మోతీ దర్వాజా వద్ద గల మోతీ మసీదుకు కూడా నేడు చెక్కు చెదరకుండా ఉంది. లంగర్‌హౌస్ చెరువును ఆనుకొని ఉన్న కుతుబ్‌షాహీ మసీదు సైతం నేటికి చెక్కుచెదరకుండా ఉంది. గత సంవత్సరం వర్షాకాలంలో ఈ మసీదుపై పిడుగు పడినా కూడా మసీదుకు ఎటువంటి నష్టం వాటిల్లలేదు.


గోల్కొండ మోతీమహల్‌లోని మసీదు

ప్రత్యేక శైలితో నిర్మాణం...

- గోల్కొండ కుతుబ్‌షాహీ మసీదు, లంగర్‌ఖానా మజీదులు ప్రత్యేక శైలితో నిర్మించబడ్డాయి.
- వీటి నిర్మాణానికి డంగు సున్నంతో పాటు మట్టి ఇటుకలు వాడబడ్డాయి. ఈ మసీదులకు కమాన్‌లు ఎంతో సన్నగా, ఆకర్షనీయంగా నిర్మించబడ్డాయి.
- ఇండో పర్షియన్ శైలికి అద్దం పడుతున్న ఈ మసీదులు పిడుగు పాటును కూడా తట్టుకోగలవు.
- వీటిలో కొన్ని మసీదులలో వెయ్యి మంది వరకు నమాజ్ ఆచరించే వీలు ఉంది. మరికొన్ని మసీదులు 50–200 మంది వరకు మాత్రమే సరిపోయే విధంగా నిర్మించబడ్డాయి.
- మసీదు మధ్యలో ప్రత్యేక శైలితో అలంకరించి వాటికి ఆనాటి నిర్మాణ శైలికి అనుగుణంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ పూత కూడా వేయడం జరిగింది. అయితే ప్రస్తుతం ఈ మసీదుల వర్జినాలిటీకి ఏ మాత్రం దెబ్బతగలకుండా మసీదు నిర్వాహణ కమిటీలు సంవత్సరానికి ఒకసారి వైట్ వాషింగ్ చేస్తున్నాయి.

గోల్కొండలో ఫ్లాగ్‌మార్చ్


గోల్కొండ వీధుల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్‌లో ఏసీపీ సయ్యద్ తదితరులు

గోల్కొండ: శాంతిభద్రతలను కాపాడడానికే ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. ఆదివారం గోల్కొండ పోలీసులు నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో అ భద్రత భావం దూరం చేసి పోలీసులపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని మరింత పెంచడానికి ఫ్లాగ్ మార్చ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. స్థానిక ఉత్సవాలు, పండుగల సందర్భాలలో అల్లర్లు సృష్టించడానికి కొన్ని అసాంఘిక శక్తులు కుట్రలు పన్నుతుంటాయని వారి కుట్రలు భగ్నం చేయడానికి తాము ఎప్పుడు సిద్ధంగా ఉంటామని ఆయన అన్నారు. స్థానిక పోలీసులతో పాటు స్పెషల్ బెటాలియన్ దళాలు చేతిలో జాతీయ జెండాలు పట్టుకొని జరిగిన ఈ ఫ్లాగ్‌మార్చ్‌కు అన్ని వర్గాల ప్రజలు స్వాగతం పలికారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు పాల్గొన్నారు.

పబ్లిక్‌గార్డెన్స్‌లో హోలీ సంబరాలు



నాంపల్లి: మహేశ్వరి సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం పబ్లిక్‌గార్డెన్స్‌లో హోలీ సంబరాలు జరిగాయి. గార్డెన్ గ్యాలరీలో ఆనందోత్సాహల నడుమ జరిగిన సంబరాలకు హైదరబాద్ పార్లమెంట్ స్థానం బీజేపీ అభ్యర్థి మాధవీలత హాజరయ్యారు. ఈ వేడుకల్లో రాజస్థాని, మార్వాడీ కుటుంబాలు ఒకరికొకరు రంగులు పూసుకుని, నృత్యాలు చేస్తూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని మాధవీలత అన్నారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను మహేశ్వరీ సమాజ్ కాపాడుకుంటూ ముందుకు తీసుకెళ్తోందన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతం



చాంద్రాయణగుట్ట: పెళ్లీడుకు వచ్చిన యువతులకు వివాహం జరిగేందుకు ఉప్పుగూడ రక్షాపురంలోని శివాలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను జరిపించారు. 18 ఏళ్లు నిండిన యువతులతో ఆలయ ప్రధాన అర్చకులు నేతి మాధవ శర్మ పర్యవేక్షణలో ఈ వ్రత మహోత్సవం కొనసాగింది. జీవితంలో వివాహం, సంతానం ఆవశ్యకతలను ఈ సందర్భంగా ఆయన హితబోధ చేశారు. స్థానిక పరిసరాలకు చెందిన యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని నియమ నిష్టల నడుమ వ్రత పూజలు చేశారు. ఆలయకమిటీ ఈఓ శ్రీనివాస్, ఇన్‌చార్జి పార్థసారథి అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేశారు.

భగత్‌సింగ్ ఆశయాలు చాలా గొప్పవి

నాంపల్లి: భగత్‌సింగ్ ఆశయాలు చాలా గొప్పవని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) హైదరాబాద్ జిల్లా కమిటీల సంయుక్తాధ్వర్యంలో ఆదివారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో భగత్‌సింగ్ స్మారక యువజన ఉత్సవాల ముగింపు సభ జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడారు. విద్యా సంస్థల్లో విద్యార్థులకు డ్రగ్స్ లేకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సినీ నటుడు శివారెడ్డి మాట్లాడుతూ..దేశం కోసం యువత ఆలోచించాలన్నారు. భగత్‌సింగ్ లాంటి యోధుల జీవితాల నుంచి స్ఫూర్తి పొందాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ..యువకులు భగత్‌సింగ్‌లను ఆదర్శంగా తీసుకుని సమస్యలపై పోరాడాలన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, అనగంటి వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.అశోక్‌రెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎండి జావిద్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బల్మూరి వెంకట్

మరోసారి ఎంపీ రంజిత్‌రెడ్డిదే విజయం


ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసిన దళిత రత్న అవార్డు గ్రహీత మాణిక్‌రావు

అబిడ్స్: ఈ పార్లమెంటు ఎన్నికల్లో రంజిత్‌రెడ్డి చేవెళ్ల నియోజకవర్గంలో మరోసారి విజయం సాధిస్తారని దళితరత్న అవార్డు గ్రహీత, గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాణిక్‌రావు పేర్కొన్నారు. ఆదివారం ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాణిక్‌రావు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ పేద బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం వారి సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. చేవెళ్లతో పాటు రాష్ట్ర నలుమూలలా కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుస్తుందన్నారు. మైనార్టీలతో పాటు అన్నివర్గాల ప్రజలు రంజిత్‌రెడ్డిని మరోసారి గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

అనుమానితులపై అప్రమత్తంగా ఉండాలి



చార్మినార్: అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉంటూ అవసరమైన ముందు జాగ్రత్త చర్యలన్నీ తీసుకుంటున్నామని దక్షిణ మండలం డీసీపీసాయి చైతన్య తెలిపారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మహిళా పోలీస్ బందోబస్తుతో చార్మినార్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ జరిగింది. ఈ సందర్భంగా చార్మినార్ వద్ద డీసీపీ సాయి చైతన్య విలేకర్లతో మాట్లాడుతూ..రాబోయే పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేటట్లు ఇప్పటి నుంచే అవసరమైన శాంతి భద్రతల చర్యలన్నీ తీసుకుంటున్నామన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ఓటర్లందరూ తమ ఓటు హక్కును శాంతియుత వాతావరణంలో వినియోగించుకోవడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఫ్లాగ్‌మార్చ్ లో దక్షిణ మండలం అదనపు డీసీపీ షేక్ జహంగీర్‌తో పాటు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

వృద్ధురాలి అదృశ్యం


మహ్మద్ ప్యారీ బేగం

దూద్‌బౌలి: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన చార్మినార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చేటుచేసుకుంది. ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల్‌లోని జాఫర్ నగర్‌కు చెందిన మహ్మద్ ప్యారీ బేగం (65) కోడళ్లు, కుమారునితో కలిసి గాంధీ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందిన అనంతరం చార్మినార్ సందర్శనకు వచ్చింది. స్థానికంగా ఉన్న ఓ హోటల్‌లో భోజనం చేసి అందరి కన్నా ముందుగా హోటల్ నుంచి బయటికి వచ్చి తప్పిపోయింది. ఆమె ఆచూకీ కోసం చార్మినార్ పరిసరాల్లో ఎంత వెతికినా కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నామన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



గౌలిపురా: తప్పిపోయిన బాలికను మొఘల్‌పురా పోలీసులు ఆదివారం గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..సీతారాంబాగ్ కోమటికుంటకు చెందిన శంకర్ భార్య, కుమారుడు ధంతేష్ (3)తో కలిసి పాతబస్తీ ఛత్రినాకలోని తల్లిగారి ఇంటికి వచ్చారు. ధంతేష్ ఆదివారం ఇంటి ముందు ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు. దీంతో మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో బాలుడు రోడ్డుపై ఏడుస్తూ కనిపించడతో ఆదర్శ్ గమనించి బాలుడిని మొఘల్‌పురా పోలీసులకు అప్పగించారు. పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి స్టేషన్‌లో బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

క్షయ రహిత సమాజానికి కృషి చేయాలి


నిత్యావసర వస్తువులను అందిస్తున్న ఏవీఎస్ శివకార్తికేయ, అనిల్ దేశాయ్, సత్యజిత్

అబిడ్స్: క్షయవ్యాధి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డబ్ల్యూఎం వర్చ్యువల్ మాస్టర్ ఏవీఎస్ శివకార్తికేయ, ఏఆర్ఎం అనీల్ దేశాయ్, కార్యదర్శి సత్యజిత్ తుల్జాపూర్కర్, ఐఎంఏ గౌరవ కార్యదర్శి డాక్టర్ శ్రీరంగ అబ్కారీ కోశాధికారి డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం గోషామహల్‌లోని బారాదరిలో లాడ్ మోర్లాండ్ నెంబర్ 25 హైదరాబాద్, నిక్షయ్ మిత్ర స్కీమ్ పక్షాన ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని 40 మంది టీబీ రోగులకు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..టీబీ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం టీబీ వ్యాధి రోగులకు ప్రతినెలా 500 పెన్షన్‌తో పాటు మందులు ఉచితంగా ఇస్తుందన్నారు. లాడ్ మోర్ సంస్థ ముందుకొచ్చి దాదాపు 6 నెలల పాటు ప్రతినెలా సరుకులను అందిస్తున్నామన్నారు. వీఎస్ సుధాకర్, అల్లాఫ్, కృష్ణ, దిలీప్ కులకర్ణి, దినేష్‌దాస్, ఆదిత్య, దినేష్‌దాష్, విజయ పాల్గొన్నారు.

మహిళలకు పురస్కారాలు ప్రదానం


పురస్కార గ్రహీతలతో డాక్టర్ కేవీ.రమణాచారి

గన్‌ఫౌండ్రీ: మహిళలను గౌరవించడం ఉత్తమ సాంప్రదాయమని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. ఆదివారం మాసబ్‌ట్యాంక్‌లోని తన కార్యాలయంలో శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ 6వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు దాత్రి పురస్కారాలు, పాత్రికేయులకు నగదు సత్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..10 మందిలో గుర్తింపు పొందినవారు మరింత ఎత్తుకు ఎదిగేందుకు ఆత్మ విశ్వాసంతో కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ మల్లీశ్వర్, కార్టూనిస్టు పద్మ, స్విమ్మింగ్ క్రీడాకారిణి క్వీన్ విక్టోరియా, సంస్థ వ్యవస్థాపకురాలు పాలపర్తి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

'అమ్మవారి ఆశీస్సులతో ఎంపీగా గెలుస్తా'

గోల్కొండ: అమ్మవారి ఆశీస్సులతో హైదారాబాద్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలుస్తానని హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత అన్నారు. ఆమె బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కార్వాన్‌లోని దర్బార్ మైసమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పాతనగర అభివృద్ధే ఎజెండాగా ఎన్నికల ప్రచారంలో ముందుకు సాగుతానన్నారు. అన్ని వర్గాల ప్రజల మద్దతుతో మజ్లిస్ గోడలను కూల్చి బీజేపీ అభ్యర్థిగా హైదరాబాద్ నుంచి పార్లమెంటులో అడుగుపెడతానన్నారు. ఆమె వెంట బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, రాధాకిషన్‌యాదవ్ తదితరులున్నారు.

ఇఫ్తార్ విందు



గోల్కొండ: ఇఫ్తార్ విందులు స్థానికుల మధ్య ఉన్న ప్రేమాభిమానాలకు వేదికలని మజ్లిస్ శాసన సభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. ఆదివారం నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్ సాలర్ బ్రిడ్జి వద్ద ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ చారిత్రక నగరం అని ఈ నగరంలో ఇఫ్తార్ విందులు కూడా ఒక భాగమన్నారు. ఈ విందులో ఆయన తన కుమారుడు నూరుద్దీన్ ఒవైసీతో కలిసి పాల్గొనడం మజ్లిస్ పార్టీ అభిమానులకు ఆశ్చర్యానికి గురి చేసింది. రాజకీయాలకు దూరంగా ఉండే నూరుద్దీన్ ఒవైసీ తండ్రితో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొనడం చర్చనీయంశంగా మారింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కౌసర్, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

ఘనంగా కామదహనం


పూజలు చేస్తున్న మదిర సత్యనారాయణ తదితరులు

జియాగూడ: హోలీని పురస్కరించుకుని ఇమాంపురా నవభారత సంఘంలో కామదహన పూజలు ఘనంగా నిర్వహించినట్లు సంఘం అధ్యక్షుడు మదిర సత్యనారాయణ అన్నారు. ఆదివారం సాయంత్రం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కామదహన పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వినయ్‌కుమార్, మహేష్‌బాబు, ఆర్.బాలకిషన్, డి.సంతోష్‌కుమార్, నర్సింగ్‌రావ, సత్యనారాయణ, సి.నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మాధవీలత గెలుపునకు కృషి చేయాలి


మాట్లాడుతున్న భీశ్వ ఓంప్రకాష్


అబిడ్స్: హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీలతను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని రాష్ట్ర బీజేపీ దళిత మోర్చా ఉపాధ్యక్షుడు భీశ్వ ఓంప్రకాష్ పిలుపునిచ్చారు. గన్‌ఫౌండ్రీ ఆర్యసమాజ్‌లో జరిగిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలన్నారు. మజ్లిస్ పార్టీని ఓడించే సత్తా బీజేపీకే ఉందన్నారు. ఈ ఎన్నికల్లో మజ్లిస్‌ను చిత్తుగా ఓడించి బీజేపీ సత్తా చాటాలని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ప్రగతితోనే బీజేపీ విజయం సాధిస్తుందని ఓంప్రకాష్ అన్నారు. పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవిలత మాట్లాడుతూ..తనను గెలిపిస్తే హైదరాబాద్ పార్లమెంట్‌ను దేశంలోనే ఆదర్శ పార్లమెంట్ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సురేఖ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలు


ఇఫ్తార్ విందులో మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ నాగదుర్గా ప్రసాద్

గౌలిపురా: ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ అన్నారు. సుల్తాన్‌షాహీ మసీదులో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని ముస్లింలకు పండ్లు తినిపించి ఉపవాస దీక్షలను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో మసీదు నిర్వాహకులు, ముస్లిం మత పెద్దలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పాతబస్తీలో షాపింగ్ సందడి





రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పాతబస్తీలో ఆదివారం షాపింగ్ సందడి నెలకొంది. మదీనా, చార్మినార్ ప్రాంతాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఈ కారణంగా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది.
- సాక్షి, సిటీబ్యూరో


ఆధారాలు లేని నగదు పట్టివేత

అబిడ్స్: భారీ ఎత్తున నగదును తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను బేగంబజార్ పోలీసులు, సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని ఎలాంటి ఆధారాలు లేని రూ.25 లక్షల నగదును స్వాధీనపరచుకున్నారు. బేగంబజార్ ఫీల్‌ఖానాలో ఎన్నికల్లో భాగంగా పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించగా సురకంటి కిరణ్‌రెడ్డి, కల్లెం జంగారెడ్డి, ద్విచక్ర వాహనంపై రూ.25 లక్షల నగదుతో వెళ్తున్నారు. పోలీసులకు అనుమానం రాకుండా కాలేజ్ స్టూడెంట్ తరహాలో ఇద్దరు రెండు కాలేజీ బ్యాగ్‌లలో డబ్బులు వేసుకుని తరలి వెళ్తున్నారు. అనుమానంతో పోలీసులు ఆ బ్యాగులను తనిఖీ చేయగా ఆ రెండు బ్యాగుల్లో రూ.25 లక్షల నగదు ఉన్నట్లు గుర్తించారు. వారిద్దరిని అదుపులోకి తీసుకుని డబ్బులు సీజ్ చేశారు. ఇన్‌కమ్‌ట్యాక్స్ అధికారులకు డబ్బులు అప్పగించనున్నట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు.

భవానీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో..

గౌలిపురా: పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తనిఖీల్లో రూ.3.45 లక్షలు లభ్యమయ్యాయి. ఇన్‌స్పెక్టర్ బాల స్వామి తెలిపిన వివరాల ప్రకారం ..భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తలాబ్ కట్టా ప్రధాన రోడ్డులో ఆదివారం ఇన్‌స్పెక్టర్ బాల స్వామి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. కాగా అదే సమయంలో కౌశిక్ పంచ్ (40) అనే మహిళ తన కారులో వెళుతుండగా ఆపి తనిఖీలు నిర్వహించారు. ఆమె కారులో 3.45 లక్షలు లభ్యమయ్యా యి. డబ్బులకు సంబంధించిన ఎలాంటి పత్రాలను చూపించకపోవడంతో సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగించారు.

ఉత్సవాల పోస్టర్ విడుదల



చాంద్రాయణగుట్ట: లలితాబాగ్ మల్లికార్జుననగర్‌లోని విఘ్నేశ్వర సాయిధామమ్‌లో 23వ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. వచ్చే నెల 15 ప్రారంభం కానున్న ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను కమిటీ చైర్మన్ మిద్దెల చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్షుడు బొడ్డు వెంకట స్వామి, కోశాధికారి శ్రీకాంత్, యూత్ కమిటీ సలహాదారుడు మునిగంటి మహేష్ కుమార్ చారి, ఉపాధ్యక్షుడు అభిషేక్ చారి ఆదివారం ఆవిష్కరించారు. ఏప్రిల్ 15న విష్ణు సహస్ర పారాయణం, 16న ధ్వజారోహణ, 17న సీతారాముల స్వామి వారి కల్యాణం ఉంటుందని తెలిపారు.